క్లుప్తంగా

ఆలయానికి రూ.లక్ష విరాళం



కరావులీశ్వర ఆలయానికి విరాళం అందజేస్తున్న సుబ్బారెడ్డి దంపతులు

గోరంట్ల: కరావులపల్లిలో దాతలు, గ్రామస్తుల సహకారంతో నిర్మిస్తున్న కరావులీశ్వర ఆలయ నిర్మాణానికి ఏపీ ఎన్‌జీఓ మాజీ ఉపాధ్యక్షుడు, మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు సుబ్బారెడ్డి దంపతులు గురువారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు సుబ్బారెడ్డి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రామచంద్రారెడ్డి, గొల్ల శ్రీరాములు, చింతా రామకృష్ణారెడ్డి, రంగప్ప, రేపటి కృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, చింతా ప్రసాద్‌రెడ్డి, రేపటి గోవిందరెడ్డి, చింతా శివారెడ్డి, బాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషను గౌరవించాలి

మడకశిర: తెలుగు భాషను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సాహితి స్రవంతి జిల్లా కన్వీనర్ హరి కోరారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో తెలుగు భాష రక్షణ–మన బాధ్యత అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగులోని తియ్యదనాన్ని ఎంత చెప్పినా తక్కువే అన్నారు. తెలుగు భాషను రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ శివన్న, కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, తెలుగు అధ్యాపకురాలు మానస, ఎస్ఎఫ్ఐ నాయకుడు ఈరేష్ పాల్గొన్నారు.

గడువులోపు ఓటరు పరిశీలన పూర్తి చేయండి



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ కార్తీక్

పెనుకొండ: గడువులోపు ఓటరు పరిశీలన పూర్తి చేయాలని సబ్‌కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణంలో గురువారం అధికారులు, రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఈనెల 21 నుంచి ఆగస్టు 21 వరకూ ఇంటింటికీ వెళ్లి ఓటరు వివరాలను పరిశీలించడం జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకోవచ్చన్నారు. క్షేత్రస్థాయిలో కొత్త ఓటర్ల నమోదు, చనిపోయిన వారి ఓట్ల తొలగింపును పారదర్శకంగా చేపట్టాలన్నారు. అనంతరం ఫారం–6, 7, 8 గురించి వివరించారు.

మల్బరీ సాగుతో ఆదాయం



మల్బరీ సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మడకశిరరూరల్: మల్బరీ సాగుతో ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని శాస్త్రవేత్త బాషా రైతులకు సూచించారు. గురువారం మడకశిర పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో పాపసానిపల్లి వద్ద వైఎస్సార్ పట్టుబడి–రైతు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మల్బరీ సాగు, వ్యాపించే తెగుళ్లు, పట్టు పురుగుల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త బాషా మట్లాడుతూ.. మార్కెట్‌లో పట్టుగూళ్లకు మంచి ధర ఉందన్నారు. నీటి సౌకర్యం ఉన్న రైతులు మల్బరీ సాగు చేయాలని సూచించారు. మల్బరీ సాగు చేసే రైతులకు పట్టు పరిశ్రమ శాఖ అధికారులు సహకారం అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్బీకే ఇన్‌చార్జ్ లావణ్య, అధికారులు, మల్బరీ రైతులు పాల్గొన్నారు.

17 పంచాయతీల్లో జేడీఎస్ విజయం



విజయం సాధించిన పంచాయతీ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: 34 గ్రామ పంచాయతీ అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు ఇటీవల జరిగిన రెండో విడత ఎన్నికల్లో జేడీఎస్ 17 స్థానాల్లో విజయం సాధించిందని జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆర్సీ అంజినప్ప తెలిపారు. తాలూకాలోని రాజవంతి గ్రామంలో విజయం సాధించిన పంచాయతీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షురాలు తదితర సభ్యులకు సన్మానం చేశారు. ఇటీవల జరిగిన విధాన సభ ఎన్నికల్లో తమ అభ్యర్థి తిమ్మరాయప్ప ఓటమి పాలైనా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 17 స్థానాలను గెలిచి ఉనికిని చాటుకున్నామన్నారు. వచ్చే జెడ్పీ, టీపీఎస్ ఎన్నికల్లో తప్పక విజయం సాధించి సత్తా చాటుతామన్నారు.

పేద ప్రజలకు అండగా ప్రభుత్వం

- సీఎం వైఎస్ జగన్ పాలనలోనే ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు
- ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి




దిన్నేహట్టిలో పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

గుడిబండ: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే అందించి పేదలకు అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి తెలిపారు. మండల పరిధిలోని మందలపల్లి సచివాలయం పరిధిలోని దిన్నేహట్టి, ఎంఎస్ తండా, దేవహట్టి గ్రామాల్లో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. లబ్ధి పొందిన బుక్‌లెట్లను కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏ ఇంటి వద్దకు వెళ్లిన ప్రజలు తమ కుటుంబానికి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌కు అండగా నిలుస్తామంటూ ఎమ్మెల్యేకు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ సీఎంగా ఉంటేనే సక్రమంగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామంలో ప్రజలు తెలియజేసిన చిన్న చిన్న సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలని ఉద్యోగులకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, జెడ్పీటీసీ భూతరాజు, సర్పంచులు రంగస్వామి, డీఎల్ యాంజారేగౌడ్, సింగల్ విండో అధ్యక్షుడు చంద్రశేఖర్, ఎంపీటీసీ నాగమణి, కో–ఆప్షన్ సభ్యుడు కాసిఫ్, నాయకులు కృష్ణమూర్తి, శివకుమార్, రంగనాథ్, శివరాజు, శశిధర్, రామచంద్ర సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా ఉండాలి

మడకశిర: ప్రైవేట్ కళాశాలల యజమానులు పేద విద్యార్థులకు అండగా ఉండాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి కోరారు. పట్టణంలో నూతన ప్రైవేట్ జూనియర్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. గురువారం కళాశాల కరస్పాండెంట్ కోట్ల రంగనాథ్ తదితరులు ఎమ్మెల్యేని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పేద విద్యార్థులపై దృష్టి పెట్టి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకు రావాలని కోరారు.

అంధ విద్యార్థులకు తోడుగా..



పరిగి మండలంలోని కొడిగెనహళ్లిలో ఉన్న ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో వివిధ జిల్లాలకు చెందిన అంధ విద్యార్థులు చదువుతున్నారు. వీరు నెలకు ఒకసారి పింఛన్ తీసుకునేందుకు తమ తమ ఊళ్లకు తప్పనిసరిగా వెళ్లాల్సిన దుస్థితి. ఊరికి వెళ్లాలంటే బస్సు చార్జీల ఖర్చు పింఛన్ పొందే డబ్బుల కన్నా రెట్టింపుగా ఉండేది. ఇది తల్లిదండ్రులకు చాలా భారంగా మారేది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ అంధ విద్యార్థులకు వరంగా మారింది. వలంటీర్ వెంకటేశ్ ప్రతి నెలా 1వ తేదీనే పాఠశాలకు వెళ్లి వైఎస్సార్ పింఛన్ కానుక ఇస్తున్నాడు. ఉన్నతాధికారుల ఆదేశాలతో 7 మంది విద్యార్థులతో బయోమెట్రిక్ వేయించుకుని, నగదు అందజేసి అండగా నిలుస్తున్నాడు. – పరిగి:



పింఛన్ అందజేసేందుకు విద్యార్థుల వేలిముద్రలు తీసుకుంటున్న వలంటీర్ వెంకటేష్ (ఫైల్)

ఒకటో తేదీన పింఛన్ అందుతోంది..

నాపేరు ఎస్‌కే యాస్మిన్. మాది నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం నల్లవాగుపల్లె. నేను 5వ తరగతి నుంచి కొడిగెనహళ్లి ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్నాను. ప్రతి నెలా పింఛన్ కోసం మా నాన్న నన్ను ఊరికి తీసుకెళ్లేవాడు. మళ్లీ ఇక్కడికి రావాలంటే బస్సు చార్జీల ఖర్చు ఎక్కువ అయ్యేది. ప్రస్తుతం వలంటీర్ వెంకటేష్ అన్న పాఠశాల వద్దకే వచ్చి పింఛన్ నగదు ఇస్తున్నాడు. పింఛన్ ఇక్కడే ఇస్తుండటంతో ఊరికి వెళ్లాల్సిన అవసరం లేదు. చార్జీల ఖర్చు మిగిలిపోతోంది.



వ్యక్తికి తీవ్ర గాయాలు

చిలమత్తూరు: మండలంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై కోడూరు మర్రోతోపు సమీపంలో గురువారం ప్యాసింజర్ జీపును వెనుక నుంచి కియా కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కోడూరుకు చెందిన నారాయణప్ప కుడి కాలు విరిగింది. గమనించిన స్థానికులు అతడిని 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు.

దేవాలయ భూమి కాపాడాలి

హిందూపురం: స్థానిక సత్యనారాయణ పేటలోని అనంత పద్మనాభ స్వామి ఆలయ భూమిని కాపాడాలని సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద్‌కుమార్, నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం కొందరు ఆలయ భూమిని చదును చేయడానికి ప్రయత్నించగా సీపీఐ నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొందరు స్వార్థపరులు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించుకుని రూ.కోట్లు విలువైన ఆలయ భూమిని కాజేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఆలయ భూములను కబ్జాదారుల నుంచి కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి ఇస్మాయిల్, నాయకులు ఫక్రుద్దీన్, బాబు, జబీవుల్లా, రామాంజినప్ప పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

అమరాపురం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హేమావతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కె.శివరం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. అలాగే డెంగీ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. ఇళ్ల వద్ద మురుగు నిలవకుండా చూసుకోవాలన్నారు. మురుగుతో దోమలు వృద్ధి చెంది జ్వరాలు సోకే అవకాశం ఉందన్నారు. అలాగే నీటి కుళాయి వద్ద పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటింటికీ తిరిగి ఫీవర్ సేర్వే చేపట్టారు. జ్వరం దగ్గు, జలుబు తదితర రోగాలతో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని ప్రజలకు తెలిపారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

రొద్దం: మండల పరిధిలోని కల్లుకుంటలో ఆర్థిక లావాదేవీల విషయంలో గురువారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకున్నట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు. కంబదూరు మండలం మేలికుంటకు చెందిన ప్రసాద్ నుంచి కల్లుకుంట చెందిన కాంతమ్మ కొంత డబ్బు తీసుకుంది. గురువారం డబ్బు అడిగేందుకు ప్రసాద్ కల్లుకుంటకు వెళ్లాడు. శబరీష్, హరీష్ అనే వ్యక్తులు ప్రసాద్‌పై దాడి చేశారు. పరస్పరం దాడులు చేసుకోవడంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జగనన్న సురక్షతో పేదలకు మేలు



రొళ్ల: ఎం.రాయాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



హిందూపురం: సర్టిఫికెట్లు అందజేస్తున్న పార్టీ సమన్వయకర్త టిఎన్.దీపిక



గోరంట్ల: ధ్రువపత్రాలను అందజేస్తున్న జిల్లా పంచాయతీ అధికారి విజయకుమార్ రెడ్డి

రొళ్ల: సచివాలయం వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే తిప్పేస్వామి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎం.రాయాపురం సచివాలయ ఆవరణలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వలంటీర్లు ప్రజలకు సేవలు చేస్తుంటే ప్రతిపక్ష పార్టీలు ఓర్వలేక పోతున్నాయన్నారు. జగనన్న సురక్షలో సమస్యలకు సత్వర పరిష్కారం చూపిస్తున్నామన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ఉచితంగా సర్టిఫికెట్లు అందజేశారు. ఎం.రాయాపురం పంచాయతీకి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామానికి చెందిన వార్డు మెంబర్ వజీర్ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. త్వరలోనే బస్సు సౌకర్యం కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నాగరాజు, వైస్ సర్పంచ్ సిద్ధగంగమ్మ, సచివాలయం కన్వీనర్ గోవిందప్ప, జేసీఎస్ మండల కన్వీనర్ నాగేంద్ర, డీలర్ ఏటీ స్వామి, మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి మురళీమోహన్‌రావు, ఎంపీడీఓ కల్లుమడి ఆజాద్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మీ, ఈఓఆర్డీ క్రిష్ణప్ప, వీఆర్వో నాగరాజు, ఇన్‌చార్జ్ కార్యదర్శి శ్రీనాథ్, ఏఓ రాజ్యలక్ష్మి, విశ్రాంత హెచ్ఎం దేవదాసు పాల్గొన్నారు.

హిందూపురం/హిందూపురం అర్బన్: అర్హులందరికీ సంక్షేమ లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త టిఎస్.దీపిక అన్నారు. శుక్రవారం తూమకుంట, మున్సిపాలిటీ పరిధిలోని 6, 8, 9, 10, 11, 12 వార్డులకు సంబంధించి ధరంపురం, లక్ష్మీపురం ప్రాంతాల్లో జగనన్న సురక్ష శిబిరాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ వలంటర్లపై విమర్శలు చేయడం దారుణమన్నారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో పవన్, టీడీపీకి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయకార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డి, కౌన్సిలర్లు పార్వతీ, షాజియా, శివ, ఆసీఫ్‌వుల్లా, గిరి, మల్లికార్జున, రామచంద్ర, అంజలీ, జయప్ప, జెడ్పీటీసీ నాగభూషణం, సర్పంచ్ రత్నమ్మ, తహసీల్దార్ హసీనాసుల్తానా, ఎంపీడీఓ నరేంద్ర, కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మినారాయణ, కోఆప్షన్‌సభ్యులు కాంతమ్మ, మండల కన్వీనర్ శ్రీరాంరెడ్డి పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: మండలంలోని మావటూరు పంచాయతీలో గురువారం 750 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివశంకరప్ప, స్పెషల్ ఆఫీసర్ పద్మావతి, సెరికల్చర్ ఏడీ రత్నం, సర్పంచ్ నాగరాజు పాల్గొన్నారు.

అమరాపురం: మండలంలోని హేమావతి సచివాలయంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంపీడీఓ మునిస్వామి, సర్పంచ్ తిప్పేస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. నోడల్ అధికారి, డీఎల్‌డీఓ శివారెడ్డి సచివాలయాన్ని సందర్శించారు. ఎంతమందికి సర్టిఫికెట్లు ఇచ్చారని వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి నరసింహమూర్తి, ఆర్ఐ గిరియప్ప, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ పాల్గొన్నారు.

లేపాక్షి: స్థానిక లేపాక్షి–2 సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్, మండల స్పెషల్ ఆఫీసర్ సుదర్శన్ మాట్లాడుతూ.. ప్రజలు 11 రకాల ధృవీకరణ పత్రాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహనాయుడు, డిప్యూటీ తహసీల్దార్ కుమార్‌స్వామి రెడ్డి, వ్యవసాయాధికారి శ్రీలత, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, మండల కన్వీనర్ నారాయణస్వామి, నాయకులు మంజునాథ్, నిస్సార్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నారని జెడ్పీటీసీ సరోజమ్మ, మండల జేసీఎస్ కన్వీనర్ నాగేంద్ర యాదవ్, వైస్ ఎంపీపీ మూర్తి తెలిపారు. గురువారం గౌడనహళ్ళి, భక్తరహళ్ళి సచివాలయాల వద్ద జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పుట్టమ్మ, ఎంపీడీఓ సోనిబాయి, తహసీల్దార్ ముర్తావలి, ఈఓఆర్డీ శైలజ పాల్గొన్నారు.

అగళి: హళ్లికెర సచివాలయంలో మండల స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్, సర్పంచ్ ముద్దరాజు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జామనుల్లా ఖాన్, ఏఓ శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

చిలమత్తూరు: వలంటీర్లపై విమర్శలు చేయడం సరికాదని ఎంపీపీ పురుషోత్తమరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సంజీవరాయునిపల్లిలో సర్పంచ్ సంధ్య అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. వలంటీర్లపై ఆరోపణలు చేయడం మానుకోవాలని టీడీపీ, జనసేన నాయకులకు హితవు పలికారు. వలంటీర్లు పేదలకు నిస్వార్థంగా సేవలందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఇన్‌చార్జి ఎంపీడీఓ రామ్‌కుమార్,ఎంపీటీసీ రాఘవేంద్రరెడ్డి, సీనియర్ నాయకుడు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గోరంట్ల: జగనన్న సురక్ష కార్యక్రమంతో పేదలకు మేలు జరుగుతందని జిల్లా పంచాయతీ అధికారి విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని వడిగేపల్లి, నార్సింపల్లి సచివాలయాల్లో జగనన్న సురక్ష శిబిరాలు జరిగాయి. గ్రామ సభల ద్వారా పేదలకు ఉచితంగా ధ్రువపత్రాలను అందజేస్తున్నట్లు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు పాలే జయరాం నాయక్, మండల ఉపాధ్యక్షుడు నాగభూషణరెడ్డి, సర్పంచులు లక్ష్మీదేవి, నరసింహమూర్తి, ఎంపీడీఓ రఘునాథగుప్త, డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిశేఖర్ పాల్గొన్నారు.

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి–3 సచివాలయ పరిధిలోని పెద్దిరెడ్డిపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరస్వతి, మండల ప్రత్యేకాధికారి ప్రసాద్‌రావు, సర్పంచ్ శ్రీరామప్ప రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, జెడ్పీటీసీ శ్రీరామప్ప, ఎంపీటీసీలు మారుతీరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, చిక్కన్న, నాయకులు బీఆర్ నారాయణ, నరసింహారెడ్డి, గఫూర్‌ఖాన్, వైస్ సర్పంచ్ సాకమ్మ, పద్మ, సెక్రెటరీ నారాయణ, నాగబూషణ, విశ్వనాథ్‌రెడ్డి, బయప్పరెడ్డి, కెంచప్ప, హరుణబాషా, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రొద్దం: మండల పరిధిలోని ఎం.కొత్తపల్లి సచివాలయ ఆవరణలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్ తహసీల్దార్ అనంతచారి, ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, ఈఓఆర్డీ కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన చెట్టు



అమరాపురం: మండలంలోని ఆలదపల్లి గ్రామం నుంచి కె.శివరం గ్రామానికి వెళ్లే రహదారికి కుడివైపున ఉన్న పెద్ద చెట్టు గురువారం గాలీవానకు నేలకూలింది. అయితే ఆ సమయంలో ఎవరూ అక్కడ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు. చెట్టు రోడ్డుకు అడ్డంగా పడటంతో కొంతసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ గిరిజమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

వ్యవసాయ శాఖ సలహా మండలి అధ్యక్షుడిగా ప్రభాకర్ గౌడ్



ప్రభాకర్ గౌడ్‌కు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న దృశ్యం

లేపాక్షి: వ్యవసాయ శాఖ సలహా మండలి అధ్యక్షుడిగా శిరివరం పంచాయతీ పరిధిలోని గోపిందేవరపల్లికి చెందిన ప్రభాకర్‌గౌడ్ ఎంపికయ్యారు. లేపాక్షి–2 సచివాలయంలో గురువారం ఉదయం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రభాకర్‌గౌడ్‌కు నియామక ఉత్తర్వులను మండల స్పెషల్ ఆఫీసర్ సుదర్శన్, ఎంపీడీఓ నరసింహనాయుడు అందజేశారు. అనంతరం జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, మండల కన్వీనర్ నారాయణ స్వామి, సర్పంచులు ఆదినారాయణ, మంజునాథ, నాయకులు నిస్సార్, మోహన్, శ్రీనివాసరెడ్డి, ఆనంద్, శంకరరెడ్డి, శ్రీనివాసులు తదితరులు ప్రభాకర్‌గౌడ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కుమార్‌స్వామి రెడ్డి, ఏఓ శ్రీలత పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

అమరాపురం/పెనుకొండ/లేపాక్షి/హిందూపురం టౌన్: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లో గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్ఏలు రిలే దీక్షలు చేపట్టారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. అందరికీ ప్రమోషన్లు కల్పించాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరారు. డీఏ రికవరీ ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో వీఆర్ఏలు, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్‌కు ఘన స్వాగతం



రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ రామచంద్రకు స్వాగతం పలుకుతున్న నాయకుడు వేణురెడ్డి

హిందూపురం/చిలమత్తూరు: రానున్న ఎన్నికల్లో హిందూపురం నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర అన్నారు. విజయవాడలో ప్రమాణ స్వీకారం చేసిన ఆయన గురువారం పెనుకొండకు వచ్చారు. హిందూపురం సమీపంలోని హైవేలో హిందూపురం సమన్వయకర్త దీపిక, నాయకుడు వేణురెడ్డి తదితరులు రామచంద్రకు ఘనంగా స్వాగతం పలికారు. అంతకుముందు కొడికొండ చెక్‌పోస్టు వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమైంది. కార్యక్రమంలో చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు.

పెనుకొండ/పెనుకొండ రూరల్/సోమందేపల్లి: వాల్మీకి, బోయ కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్రకు పెనుకొండ, సోమందేపల్లి మండలాల్లో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆయన సోమందేపల్లి, పెనుకొండ మండల కేంద్రాల్లో వాల్మీకి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ ర్యాలీ చేపట్టారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో పెనుకొండ మాజీ సమన్వయ కర్త చల్లాపల్లి బాబు రెడ్డి, 65 బీసీ కులాల కార్పొరేషన్ కో–ఆర్డినేటర్ ప్రవీణ్, నాయకులు శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ నాగముని, రాప్తాడు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అంజలి, పరిగి ప్రభాకర్, జయరాం, ప్రసాద్ రెడ్డి, నడిపి వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



విద్యార్థి అదృశ్యంపై వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ కార్తీక్

లేపాక్షి: స్థానిక మహాత్మాజ్యోతిబా పూలే ఏపీ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రిన్సిపాల్ ప్రసాద్‌కు పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ సూచించారు. గురువారం ఉదయం గురుకుల పాఠశాలను సందర్శించారు. ఇటీవల 5వ చదువుతున్న విద్యార్థి అదృశ్యమై మరుసటి రోజు అటవీ ప్రాంతంలో ప్రత్యక్షం అయిన ఘటనపై ఆరా తీశారు. కొంత మంది విద్యార్థులు అనుమతి లేకుండా బయటకు వెళుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల నుంచి విద్యార్థి ఎలా వెళ్లిపోయాడు? ఎందుకు వెళ్లిపోయాడని అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సంక్షిప్త సమాచారం

మానవ హక్కుల ఉల్లంఘన నేరం

హిందూపురం టౌన్: మానవహక్కుల ఉల్లంఘన తీవ్ర నేరమని ఇంటర్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌కే మహమ్మద్ ఖలీల్, యాంటీ కరప్షన్ సెల్ సౌత్ ఇండియా జోన్ కన్వీనర్ షఫీవుల్లా అన్నారు. గురువారం పట్టణంలోని ఆర్‌పీజీటీ రోడ్డులో ఉన్న ఈద్గా కాంప్లెక్స్‌లో ఐహెచ్‌ఆర్‌పీసీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో మానవ హక్కుల ఉల్లంఘనలు పెరిగిపోతున్నాయన్నారు. హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రభుత్వమే ప్రత్యేకంగా జాతీయ మానవ హక్కుల కమిషన్ ఏర్పాటు చేసి మానవ హక్కుల రక్షణకు కృషి చేస్తోందన్నారు. మానవ హక్కుల ఉల్లంఘన జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

కార్మికుల రిలే నిరాహార దీక్షలు

హిందూపురం టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు గురువారం రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. స్థానిక ఇందిరా పార్కు నుంచి కార్మికులు ర్యాలీగా మున్సిపల్ కార్యాలయం చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి నరసింహప్ప, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జగదీష్, ట్రెజరర్ ఆనంద్, జాయింట్ కార్యదర్శి నరసింహమూర్తి, మంజునాథ్, నరసింహమూర్తి, రామచంద్రప్ప, రామాంజినప్ప, చంద్ర, శంకర్ పాల్గొన్నారు.

తిరుమణి అభివృద్ధికి కృషి



నూతన పంచాయతీ అధ్యక్షుడు లోకేష్ చౌదరిని సన్మానించిన గ్రామస్తులు

పావగడ: తిరుమణి గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆ గ్రామ పంచాయతీ నూతన అధ్యక్షుడు లోకేశ్ చౌదరి తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తాగు నీటి సమస్యను ఇది వరకే తీర్చామన్నారు. పేదలందరికీ ఇళ్లు నిర్మించే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. స్వచ్ఛతకు అధిక ప్రాధాన్యత ఇచ్చి, తిరుమణిని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దుతామన్నారు. ఎమ్మెల్యే వెంకటేశ్, పంచాయతీ సభ్యుల సహకారంతో తిరుమణిని మోడల్ గ్రామ పంచాయతీగా నిలుపుతామన్నారు.